# సింగిల్ పేజీ కథ

# లంచం

పి.ఎఫ్. ఆఫీసు చుట్టూ తిరిగి తిరిగి విసుగు పుడుతోంది రాఘవమూర్తికి. ఆయన రిటైరయి ఆరు నెలలవుతోంది. వాస్తవానికి ఈ ఆర్నెల్లలోపే అతనికి రావాల్సిన పి.ఎఫ్. డబ్బంతా రావాల్సింది. కానీ రాలేదు.

ఎన్ని అప్లికేషన్స్ పంపినా ఫలితం లేకపోయింది. ఇక లాభం లేదని తనే ఆఫీసుకి బయల్దేరాడు. స్వయంగా కలిస్తేనయినా పని జరక్కపోతుందా అని అతని ఆలోచన.

'ఈరోజు సెక్షన్ క్లర్క్‌తో అమీతుమీ తేల్చుకోవాలి' అని ధృడంగా నిశ్చయించుకుని క్లర్క్ సీటు దగ్గరకు చేరాడు.

సీట్లో కూర్చుని వున్న క్లర్క్‌ని ఉద్దేశించి ''నమస్కారమండీ!'' అన్నాడు రెండు చేతులూ జోడించి మరీ.

''నమస్కారం'' అని నోటితో అన్నాడు తప్పితే, చేతులెత్తి విష్ చేయలేదతను. కనీసం తలైనా ఎత్తలేదు.

పీలవలేదు రాఘవ. మామూళ్ళు ఇచ్చేచోట ఇలాంటివన్నీ మామూలేనని సరిపెట్టుకున్నాడు. అలాగే నిలబడ్డాడు ఓపిగ్గా. ఒకటి రెండు నిమిషాలు గడిచాయి.

ఇలా ఎంతసేపు కాళ్ళు నొప్పులు పెట్టేలా నిలబడ్డా, అతగాడు తనని పట్టించుకోడని అర్థమవుతూనే ఉందతనికి-

అందుకని ''నా పి.ఎఫ్. విషయం ఏమైంది?'' అని అడిగాడు రాఘవ.

''ఇంకా ఏం కాలేదు'' ఫైల్లోంచి తలెత్తకుండానే జవాబిచ్చాడు క్లర్క్.

''ఏం కాకపోతే ఎలా? ఎన్నాళ్ళిలా తిప్పిస్తారు?''

''ఆఫీసు అటెండర్ మొన్ననే వివరాలన్నీ చెప్పాట్టగా! బరువు పెడితే చెక్ పాసవుతుంది'' నిర్మొహమాటంగా చెప్పేసాడు.

''జీతాలు తీసుకోవడం లేదా? ఇది చాలా అన్యాయం'' సహనం నశిస్తుంటే కాస్త తీవ్రంగానే అన్నాడు రాఘవ.

నవ్వి ఊరుకున్నాడు క్లర్క్.

తిక్కరేగింది ముసలాయనకి. ''లంచాలకి అలవాటుపడ్డ వాళ్ళకి న్యాయం, ధర్మం ఎక్కడుంది?''

''న్యాయం ధర్మం గురించి మీరు నాకు చెబుతున్నారా రాఘవమూర్తి గారూ!'' చేస్తున్న పనాపి అన్నాడు క్లర్క్.

అది విని ఆయన భృకుటి ముడివడింది.

ఆ క్లర్క్ మాటల్లోని వ్యంగ్యం బోధపడలేదు.

''అలాటివారు మీ అబ్బాయికి ఉద్యోగం రావడానికి ఒకప్పుడు యాభై వేలు ఎందుకు లంచం ఇచ్చారు?'' అతని కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగాడు క్లర్క్.



ఊహించని ఆ క్లర్క్ మాటలకి రాఘవమూర్తి షాకయ్యాడు.

''ఈ విషయం నీకెలా తెలుసు?''

దానికి సమాధానమివ్వకుండా ''ఉద్యోగం కొడుక్కి రావడానికి అంత పెద్ద మొత్తం లంచం ఇచ్చినవారు పి.ఎఫ్.చెక్ రావడానికి, కొద్దిగా మామూలివ్వలేకపోతున్నారెందుకని?'' ప్రశ్నించాడు.

బదులుగా తల దించుకున్నాడతను.

''అది కొడుక్కి ఉద్యోగం రావాలన్న స్వార్థ చింతన. మరి ఇది లంచం లేకుండానే పని జరగాలన్న ధర్మచింతనా? చూసారా మీలోనే రెండు వైరుధ్యాలున్నాయి'' చెప్పుకుపోతున్నాడు క్లర్క్.

మారుమాట్లాడకుండా మౌనంగా వింటున్నాడు రాఘవమూర్తి.

''లంచం అలవాటు చేసేదే మీలాంటి వాళ్ళు. మళ్ళీ ప్రభుత్వోద్యోగులు లంచాలకి మరిగారని వాపోయేదీ మీరే! ఎందుకండీ ఈ ఆత్మవంచన. కొడుకు ఉద్యోగ విషయంలోనే ధర్మబద్ధంగా ఎందుకని ఆలోచించలేకపోయారు. ప్రతిభ ఉన్నవాడికే ఉద్యోగం రావాలని ఎందుకు ఆశించలేదు. ఆరోజు మీరు ఆఫీసర్‌కి ఎరచూపిన 'లంచం' నా జీవితం మీద కాటు వేసింది. ర్యాంక్ ప్రకారం ప్రతిభతో నాకు రావాల్సిన ఆ జాబ్, నాకంటే తక్కువ మార్కులు వచ్చిన మీవాడికి వచ్చేసింది. ఇప్పుడు చెప్పండి సార్, అన్యాయం ఎవరికి జరిగింది? ఎవరు లంచగొండో?'' అడుగుతున్నాడు క్లర్క్.

ఆ క్లర్క్ ముఖంలో తీవ్ర ఆవేదన ప్రతిబింబిస్తోంది. ప్రక్షాళనమైన రాఘవ మనసు పాతాళంలోకి కుంచించుకుపోయింది.

''అయినా మీమీద నాకెలాంటి చెడు భావన లేద్సార్. ఆ ఉద్యోగం కాకపోతే మరొకటి వస్తుంది లెమ్మని ఆరోజు బాధని దిగమింగుకున్నాను. నా తెలివితేటల మీద నాకా నమ్మకం వుంది. ఈ ఉద్యోగం సంపాదించాను. లంచం ఇచ్చి జాబ్‌లోకి వచ్చిన వాళ్ళు లంచాలకి అలవాటు పడతారేమో నాకు తెలీదుగానీ నేనలాంటి వాడ్ని కాద్సార్. ఎనీవే, గతం తవ్వి మిమ్మల్ని బాధపెట్టాలని, మీ మనసు నొప్పించాలని, మీమీద కక్ష సాధించాలనీ నా ఉద్దేశ్యం కాదు. మీ తప్పు మీరు తెలుసుకుంటే చాలు'' అన్నాడు.

''నన్ను క్షమించు బాబూ!''

''పెద్దవారు అలా అనకండి. మీ వయసు తండ్రే నాకూ ఉన్నాడు. ముందు మీరు కూర్చోండి. ఇంతసేపూ నిలబెట్టే మాట్లాడాను'' అన్నాడు క్లర్క్,

కూర్చున్నాడు రాఘవ.

''వాస్తవానికి మీకు సంబంధించిన చెక్ నా వరకూ రాలేదింకా. ఎక్కడ ఆగిందో కనుక్కుని పని పూర్తిచేయిస్తాను దగ్గరుండి. రేపు వచ్చి మీ చెక్ మీరు తీసుకెళ్ళండి'' నమ్మకంగా చెప్పాడు క్లర్క్.

రాఘవ చూపులు కృతజ్ఞతాభావాన్ని వెదజల్లాయి.

**-ఎనుగంటి వేణుగోపాల్ (జగిత్యాల)**